క్లుప్తంగా

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు. ఐ

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

అమల్‌కాలనీ, రాజీవ్ నగర్, పతేషా నగర్, అగ్రికల్చర్ 500కేవీఏ, షాల్విన్ మజీద్, రాం మందిర్, బిలాల్ మజీద్, దుర్గా మాతా మందిర్, వినయ్‌నగర్, గణేష్ టెంపుల్, శ్రీకార్ మోటల్, భోజిరెడ్డి కాలేజ్, మాతృశ్రీ కాలేజ్, సక్సెస్ స్కూల్, ధోబీఘాట్, ఐఎస్‌సదన్, మాదన్నపేట మండి, మెహిదిపురం, ధోబీ ఘాట్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు..

అన్‌మోల్ హోటల్, అల్‌సఫా డైయిరీ, జోరాబీ దర్గా, నూర్‌ఖాన్ బజార్ ఆఫీస్, లాల్‌మిట్టీ దర్గా, పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అన్నదానం



అన్నదాన వితరణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులతో నాగరాజు

చంపాపేట: అన్ని దానాల్లో కన్నా ఆకలిని తీర్చే అన్నదానమే మిన్న అని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ పాలక మండలి సభ్యులు నాగరాజు అన్నారు. బుధవారం చంపాపేట మూడు గుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజు అన్నదానంచేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రవి ముదిరాజ్, సునీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, రాజేష్, మహేశ్వర్‌రెడ్డి, తిలక్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ సుబ్బరామిరెడ్డి

చాదర్‌ఘాట్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి అన్నారు. బుధవారం మలక్‌పేటలోని ఎంఎస్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటు పడాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తలెత్తే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి, డీఐ భూపాల్‌రెడ్డి, ఎస్సైలు భరత్, ప్రశాంత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహిదేవి నవరాత్రులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరి పీఠ విభాగం ప్రత్యంగిరా దేవాలయంలో గురువారం నుంచి జూలై 4 వరకు వారాహి దేవి నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. గురువారం దేవాలయంలో ఉదయం 6.30కు 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, హోమాలు, ఉదయం 10.30కు కుంకుమార్చన, సాయంత్రం 6 గంటలకి పారాయణలు, అర్చనలు, రాత్రి 7.30 కు మహా నక్షత్ర హారతుల సేవ ఉంటుందన్నారు.

ఆలయంలో చోరీ చేసిన దొంగ రిమాండ్

చాదర్‌ఘాట్: ఆలయంలో చోరీకి పాల్పడిన పాత నేరస్తుడిని చాదర్‌ఘాట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. డీ-మార్ట్ ఎదురుగా ఉన్న పోచమ్మ దేవాలయంలో ఈ నెల 19న చొరబడిన దొంగ అల్మారా పగులకొట్టి వెండి ఆభరణాలు చోరీ చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు పాత నేరస్థుడైన మలక్‌పేట ఆనంద్‌నగర్‌లో నివసించే కూలీ మార్కా ఈశ్వర్ (20)గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్: రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 22న మధ్యాహ్నం అజంపురాలోని మసీద్ సమీపంలో రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

అవగాహన కల్పిస్తూ..

స్వయం ఉపాధి గ్రూపుల్లో చేర్పిస్తూ

- స్వయం ఉపాధికి చక్కటి అవకాశం
- మహిళా సంఘాల్లో చేరితే రూ. 1 లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర
- మలక్‌పేట నియోజకవర్గంలో ఇంటింటి సర్వే



మలక్‌పేటలో ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్న యూసీడీ అధికారులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు, కమ్యూనిటీ కార్యక్రమాల్లో స్వయం సహాయక బృందాలదే కీలక పాత్ర. రాష్ట్ర ప్రభుత్వం మహిళా గ్రూపులకు ఎంతో ప్రాధాన్యం కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూడా మహిళ గ్రూపు సభ్యులను నియమిస్తుంది. అర్హత ఉన్న ప్రతి మహిళ స్వయం సహాయక గ్రూపులో చేరేలా కొంత కాలంగా జీహెచ్‌ఎంసీ అధికారులు కృషి చేస్తున్నారు. అర్హత ఉన్న మహిళలంతా గ్రూపుల్లో చేరేలా కార్యచరణ ప్రణాళికను రూపొందించింది. గత నెల రోజుల నుంచి ప్రణాళికాబద్ధంగా జీహెచ్‌ఎంసీ, యూసీడీ విభాగం అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు.

18–50 సంవత్సరాల లోపు

జీహెచ్‌ఎంసీ మలక్‌పేట నియోజకవర్గంలో సర్కిల్-6 పరిధిలో ఓల్డ్‌మలక్‌పేట, మూసారాంబాగ్, సైదాబాద్, అజంపురా, అక్బర్‌బాగ్ డివిజన్‌ల పరిధిలో జీహెచ్‌ఎంసీ, యూసీడీ విభాగం రీసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఇంటింటికి వెళ్లి 18- 50 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి మహిళను గ్రూపుల్లో చేర్చేలా అవగాహన కల్పిస్తున్నారు. స్వయం సహాయక బృందాలల్లో చేరితే రూ. లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని వివరిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతి బస్తీకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఉపాధి పొందిన మహిళ గ్రూపుల అభివృద్ధిని వారికి వివరిస్తున్నారు.

కొత్తగా 20 గ్రూపులు..

మలక్‌పేట సర్కిల్‌లో ప్రస్తుతం 900 మహిళ గ్రూపులు ఉండగా గత నెల రోజుల నుంచి కొత్తగా 20 గ్రూపులను చేర్చారు. మహిళ గ్రూపుల్లో చేరడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే కాకుండా అమ్మ ఆదర్శ కమిటీలు, బస్తీల్లో సామాజిక కార్యక్రమాల్లో, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేందుకు అవకాశము ఉంటుంది. సర్కిల్-6 పరిధిలో 27 మంది రీసోర్స్ పర్సన్లు పని చేస్తుండగా, వీరంతా ప్రతిరోజు తమ ప్రాంతంలోని బస్తీలలో పర్యటిస్తూ మహిళ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహిళలు ఆర్థికంగా ఎదుగుతారు..



స్వయం ఉపాధి గ్రూపుల్లో మహిళలు చేరితే ఆర్థికంగా ఎదుగుతారు. వారి కుటుంబాలు బలోపేతం అవుతాయి. నియోజకవర్గంలో విస్తృతంగా మహిళ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నాం. ఇంటింటికి వెళ్లి కల్పిస్తున్న అవగాహనకు స్పందన వస్తోంది.

యుగంధర్‌రెడ్డి , సర్కిల్-6 యూసీడీ అధికారి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్: మలకపేట నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం ఆయన పలు ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధి ఆస్మాన్‌గఢ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ బాలదానమ్మబస్తీ, ఆస్మాన్‌గఢ్ ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటిస్తూ స్థానికుల సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి లోప్రెషర్, అధ్వానంగా మారిన రోడ్లు, సీవరేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టి తీసుకురాగా వాటి పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట రవీందర్‌రెడ్డి, మోజెస్, పారమ్మ ఉన్నారు.

పార్కు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ వనస్థలిపురం డివిజన్ పరిధి ఇంజినీర్స్ కాలనీ ఫేస్-1లోని పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు పరిశీలించారు. కాలనీ లేఅవుట్‌లో పార్కు కోసం వదిలిన 1200 గజాల స్థలం అన్యాక్రాంతం అవుతోందని, పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ కాలనీవాసులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయగా బుధవారం హైడ్రా ఎల్‌బీనగర్ ఈస్ట్ జోన్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎఫ్‌ఆర్‌ఓ బాచిరెడ్డి కాలనీవాసులతో కలిసి సదరు స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. త్వరలో అన్ని విధాలుగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు నరేందర్, కురేష్‌బాబు, మదన్‌మోహన్, రవిందర్, రవికుమార్, కవిత, సుశాదేశ్‌పాండే, శారద, విజయలక్ష్మి, డా.శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



వనస్థలిపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. వనస్థలిపురంలో ఐవీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద వితరణ, రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పబ్బా చంద్రశేఖర్ గుప్తా, కటకం శ్రీనివాస్ గుప్తా, కట్ట రవి కుమార్ గుప్తా, లోకేష్, మంజుల పాల్గొన్నారు.

ఇంటింటా.. జాతీయ జెండా

హుడాకాంప్లెక్స్: ప్రతిఇంట- జాతీయ జెండా అనే సంకల్పం ప్రతి ఒక్కరిలో ఉండాలని డాక్టర్ దార్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సరూర్‌నగర్‌లోని శ్రీ త్రివేణి పాఠశాలలో విద్యార్థులకు జాతీయ పతాకాన్ని జెల్ పెన్నులతో రూపొందించి, లామినేషన్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి నా వంతు సేవ చేయాలనే కర్తవ్యంలో భాగంగా ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ సునీల్, ప్రిన్సిపాల్ యోగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సరుకుల పంపిణీ

మీర్‌పేట: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులది కీలకపాత్ర అని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ అన్నారు. 2025- 26 సంవత్సరానికి పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం కొబ్బరినూనె, సబ్బులు, ఇతర సామగ్రిని కమిషనర్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ అధికారి నాగేందర్‌రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటాం

ఉప్పల్: మానసిక ఒత్తిడికి గురై.. రుగ్మతతో బాధపడే వారికి అండగా ఉంటామని మీన్స్ మానసిక హెల్త్‌కేర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ సరస్వతి కాలనీలోని హెల్త్‌కేర్ సెంటర్‌లో నూతనంగా సైక్యాట్రిస్ట్ క్లినిక్‌ను ఇన్నర్ వీల్ రోటరీక్లబ్ మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి, వారి బృందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 20 ఏళ్ల నుంచి సామాజిక దృక్పథంతో వృద్ధులు అనేక రకాల సేవలను అందిస్తున్న మీన్స్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. ఎలాంటి సాయమైన అందించేందుకు ముందు వరుసలో ఉంటామని వారు హామీ ఇచ్చారు.

27న సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

ఉప్పల్: రేషన్‌షాపుల్లో కార్డుల పేరిట దళారులు, కార్యాలయాల్లో తిష్టవేసి నిజమైన లబ్ధిదారులకు రేషన్ అందకుండా చేయడాన్ని నిరసిస్తూ.. ఈనెల 27న ఉప్పల్ సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా చేయనున్నట్లు జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రవేఖర్, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు పారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్ పరిధిలోని ఆండాళ్ నిలయం వెనుక లైన్‌లో ఉన్న వడ్డెరబస్తీలో బుధవారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి సీసీ రోడు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీ ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. ప్రజలు నేరుగా సమస్యలు తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు భాస్కర్, బాలరాజు, ప్రవీణ్, ప్రకాశ్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాప్టిస్టు చర్చిలో ఉచిత వైద్య శిబిరం

మలక్‌పేట: యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉచిత శిబిరం కొనసాగుతుందన్నారు. జనరల్, షుగర్, బీపీ. రక్త, కంటి దంత పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఒకరి రిమాండ్

హయత్‌నగర్: ఆన్‌లైన్ ద్వారా విటులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు దాడి చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన మహ్మద్ సుభానిబీ అలియాస్ వాసిరెడ్డి సుధారాణి హయత్‌నగర్ సూర్యతేజ కాలనీలో ఉంటుంది. ఆన్‌లైన్ ఎస్కార్ట్ సర్వీస్ ద్వారా విటులను ఆకర్షించి వారికోసం మహిళలను ఏర్పాటు చేస్తూ వ్యభిచారం చేయిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడిచేసి నిర్వాహకురాలిని రిమాండ్‌కు తరలించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.31, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.40, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.85, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.25.

బీజేపీ పాలన ప్రమాదకరం



మాట్లాడుతున్న అబ్బాస్

మలక్‌పేట: నాడు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కన్నా నేటి బీజేపీ పాలనే ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు అయిన సందర్భంగా 'ఎమర్జెన్సీకి 50 ఏళ్లు- నేటి ఫాసిస్టు విధానాలు' అనే అంశంపై పార్టీ మలక్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఇందిరగాంధీ ఎదుర్కొన్న ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక అధికారాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలను నిరసనలు, ఉద్యమాలు, పోరాటాలు చేయకుండా అణగదొక్కడానికి ఎమర్జెన్సీ విధించారన్నారు. అయితే గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న మోదీ పాలన ఎలాంటి ఎమర్జెన్సీ గానీ, ఇతర పద్ధతులను ప్రకటించకుండానే కార్మికులు, మైనార్టీలు, పేద ప్రజలను అనేక విధాలుగా అణగదొక్కుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమానికి బాలునాయక్, మీనా, స్వరూప, హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి. మహేష్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బుధవారం విద్యార్థులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన 18 నెలలు కావస్తున్నా నేటికి రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. చిన్నస్థాయి డిగ్రీ కాలేజీలు మూసివేతవైపు వెళ్తున్నాయని, వాటి స్థానంలో కార్పొరేట్ కాలేజీలు వస్తున్నాయన్నారు. అందాల పోటీలలో ప్లేటు భోజనానికి రూ.లక్ష నీళ్ల మాదిరిగా ఖర్చు చేసినా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నిరసనలో శ్రీనివాస్, తీగల శ్యామ్, యశ్వంత్, ఝాన్సీ, భరత్, ప్రతిభ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వనస్థలిపురం: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శక్తినగర్ కాలనీలో దోమల నివారణ, వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లో గడ్డి, తడి చెత్త, మురుగునీరు, వాడిపడేసిన కొబ్బరి బోండాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మన్నెమ్మ, డీపీఓ అశ్వినికుమారి, శానిటేషన్ ఏఈ ప్రసాద్, డీజీఎం రాజగోపాల్, ఏఎంహెచ్‌ఓ డా.నాగేష్ నాయక్, యాదగిరి, పర్వతాలు పాల్గొన్నారు.

డీ-అడిక్షన్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు



ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులతో డీజీ సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: మత్తు మందులు లేని సమాజాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ శాఖ నిధులు మంజూరు చేసిందని డీజీ డా. సౌమ్య మిశ్రా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీజీ డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు సంబంధించి బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. చర్లపల్లి, సంగారెడ్డి, హైదరాబాద్, నిజాంబాద్‌లో కొనసాగుతున్న ఈ సెంటర్లలో కాంట్రాక్ట్ పద్ధతిన 28 ఖాళీలు ఉండగా 798 మందిని రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సెలింగ్, మానసిక సహాయం ద్వారా పునరావాసం కల్పించడమే ఈ కేంద్రాలు ఉద్దేశమన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని వినతి

మీర్‌పేట: ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్ చౌరస్తాలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. చౌరస్తాలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో విద్యార్థులు, మహిళలు, పాదచారులు రోడ్డు దాటలేక ఇబ్బంది పడుతున్నారని, దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డీసీపీకి వివరించారు. అందువలన కూడలిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జితో పాటు ప్రమాదాల నివారణకు రంబుల్ స్టిక్స్, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

హడావుడే తప్ప.. చేసిందేమీ లేదు

- వందరోజుల ప్రణాళిక ఫలితం శూన్యం!
- అస్తవ్యస్తంగా నాలాల దుస్థితి
- డివిజన్‌లో తిష్టవేసిన సమస్యలు
- ప్రభుత్వంపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేసి, సమస్యలు తీర్చకుండానే చేతులు దులుపుకొందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఎద్దేవాచేశారు. నాలాలా పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. బుధవారం ఆమె సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో పర్యటించారు. కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో డ్రైనేజీ మొదటి దశ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, రెండో దశకు సంబంధించిన నిధులు కూడా మంజూరయ్యాయని గుర్తు చేశారు. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం తిరిగి ప్రారంభించిన పనులు.. వచ్చే ఆరు నెలల్లో పూర్తవుతాయని అంచనా వేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ముంపునకు గురికాకుండా తాత్కాలికంగా కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్‌నగర్ నాలాకు కలిపే మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అసోసియేషన్లతో చర్చించి సమ్మతించుకున్నట్లు తెలిపారు. మట్టిని తొలగించకుండా వదిలేయడం వలన ముంపు పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. వంద రోజుల ప్రణాళిక అంటూ ప్రజలను మభ్యపెట్టే బదులు, ప్రజా సమస్యలపై గైడ్‌లైన్స్ ఏమి ఉన్నాయని, అమలు దిశగా ఎలాంటి విధివిధానాలను చేపడుతున్నారని ప్రశ్నించారు. సమస్యలపై ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ప్రజాప్రతినిధులైనా మాకే ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే సామాన్యుల పరిస్థితి ఏంటని వాపోయారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కొండల్‌రెడ్డి, అశోక్, అంకిరెడ్డి, నగేష్, సాజిద్, సుశీలరెడ్డి, గౌని శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, మహేందర్, రాజుయాదవ్, సునీల్ యాదవ్, అరుణ్‌కుమార్, ఉత్తిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.